# కౌంటింగ్ భద్రత ఏర్పాట్లు పరిశీలించిన కర్నూలు రేంజ్ డిఐజి..!



**కర్నూలు, మే31, ప్రభాతవార్త :** సార్వత్రిక ఓట్ల లెక్కింపు సంధర్భంగా కౌంటింగ్ కేంద్రమైన కర్నూలు రాయలసీమ యూనివర్సిటిలో కర్నూలు రేంజ్ డిఐజి సిహెచ్ విజయారావు శుక్రవారం జిల్లా కలెక్టర్ డా.సృజన, జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్‌లతో కలిసి భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. విజిటర్స్ రిజిస్టర్‌లో డిఐజి సంతకం చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన సిసి కెమెరాల కమాండ్ కంట్రోల్, కౌంటింగ్ హాల్ ను, భద్రపరిచిన ఈవిఎంల స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. అనంతరం ఓట్ల లెక్కింపునకు తీసుకోవల్సిన భద్రత ఏర్పాట్ల గురించి కర్నూలు రేంజ్ డిఐజి కర్నూలు తాలుకా పోలీసుస్టేషన్ లో పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం భద్రత ఏర్పాట్ల పై ఆరా తీసి, పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని పలు సూచనలు, సలహాలు చేసి దిశా, నిర్దేశం చేశారు. ట్రబుల్ మాంగర్స్ కు కౌన్సిలింగ్ చేయాలి. నిఘా ఉంచాలి. ఏజెంట్స్, అభ్యర్థులు చేయవలసినవి, చేయకూడని వాటి గురించి తెలియజేయాలి. భద్రత పరంగా కౌంటింగ్ సెంటర్ వద్ద 144 సెక్షన్ అమలు చేయాలి. గుంపులు, గుంపులు గూమికూడి ఉండకుండా చర్యలు తీసుకోవాలి. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. జిల్లాలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలి. పోలీసులు అప్రమత్తంగా ఉండాలి. ఎన్నికల ఓట్ల లెక్కింపును దృష్టిలో ఉంచుకొని నేరచరిత్ర గల వారిపై నిఘా ఉంచి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండేలా చర్యలు తీసుకోవాలి. నిబంధనలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కర్నూలు రేంజ్ డిఐజి గారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఐజి వెంట అడిషనల్ ఎస్పీలు నాగరాజు, నాగబాబు, డిఎస్పీలు విజయ శేఖర్, బాబు ప్రసాద్, సీతా రామయ్య, శివ నారాయణస్వామి, శ్రీనివాసరెడ్డి, ట్రైని డిఎస్పీ భావన, సిఐలు ఉన్నారు.


కర్నూలు | నంద్యాల
వార్త
1 జూన్, 2024 శనివారం పేజీలు 4


# నిద్రమత్తుపై.. సస్పెన్షన్ వేటు..!

**: ఎన్నికల శిక్షణ తరగతుల్లో నిద్రపోయిన ఇంజనీర్**
**: సస్పెండ్ చేసిన జిల్లా కలెక్టర్**

దేశం మొత్తం ఉత్కంఠ గా ఎదురు చూసే సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియపై అధికారులు కుస్తీలు పడుతున్నారు. అయితే ఓ చిన్న స్థాయి అధికారి మాత్రం ఇదేమీ పట్టనట్టు ఓ కునుకు తీశాడు. అది గమనించిన జిల్లా కలెక్టర్ అతనని సస్పెండ్ చేయాలని ఆదేశించింది. ఇదంతా కర్నూల్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది.





**కర్నూలు, మే 31, ప్రభాతవార్త :** ఎన్నికల కౌంటింగ్ సంబంధించి కౌంటింగ్ సిబ్బందికి కలెక్టర్ కార్యాలయంలోని సునయన ఆడిటోరియంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఆ శిక్షణ తరగతులకు పెద్ద సంఖ్యలో సిబ్బంది హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ వారికి శిక్షణ సంబంధించిన విషయాలు వివరించారు. ఈ క్రమంలో హంద్రీనీవా సుజల స్రవంతి విభాగానికి చెందిన యువ ఇంజనీరు కునుకు తీశాడు. ఆ విషయం గమనించిన జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేయాలని సంబంధిత విభాగాధిపతిని ఆదేశించారు. ఈ విషయం ఉద్యోగులలో అటెన్షన్ తీసుకువచ్చింది. అదే క్రమంలో తీవ్ర చర్చకు దారి తీసింది. ప్రస్తుతం నరాలు తెగే ఉత్కంఠలో జిల్లా యంత్రాంగం ఉన్న నేపథ్యంలో నిద్రపోవడం తప్పేనని కొందరు అంటుండగా... చల్లని ఏసీలో అలసిన శరీరం అదుపుతప్పి నిద్ర మత్తులోకి జారింది. వార్నింగ్ తో సరిపెట్టాలి కానీ.. సస్పెండ్ చేస్తారా అని మరికొందరు ఉద్యోగులు అంటున్నారు. ఏది ఏమైనా సునయన ఆడిటోరియం సుందరీకరణ తో ప్రారంభమైన మొదటి రోజే ఉద్యోగుల్లో భయం పుట్టించేలా అధికారిపై సస్పెన్షన్ వేటు పడింది. ఏది ఏమైనా ఎన్నికల హడావిడిలో శిక్షణ తరగతులు నిర్లక్ష్యం చేయడం తప్పేనని పలువురు పేర్కొంటున్నారు.

# వర్షాలొస్తున్నాయ్..!

- రెండు రోజుల్లో రాష్ట్రంలోకి నైరుతి
- వారంలో రాయలసీమలో తొలకరులు
- ఈ దఫా సాదరణం కన్నా అధిక వర్షపాతం





దేశంలోకి అడుగుపెట్టిన నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. ఇప్పటికే కేరళలో ప్రవేశించిన రుతుపవనాలు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు అనుకున్న విధంగానే విస్తరిస్తున్నాయి. వీటి ప్రభావంతో రాబోయే రెండు రోజుల్లోనే ఏపీలో వర్షాలు మొదలు కాబోతున్నాయి. రేపటి నుంచి కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేస్తోంది. ఆ తర్వాత వరుసగా సాధారణ వర్షపాతం నమోదు కానుంది. ప్రస్తుతం దేశంలో వడగాల్పుల తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ రుతుపవనాల విస్తరణకు అనుకూల పరిస్థితులు కనిపిస్తున్నట్లు వాతావరణ విభాగం అంచనా వేస్తోంది. ఏపీలో ఒకటి రెండు చోట్ల తేలిక నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని, క్రమంగా ఎల్లుండి నుంచి ఇక వీటి ప్రభావం రాష్ట్రం మొత్తానికి విస్తరిస్తుందని అంచనా. అంటే మరో నాలుగైదు రోజుల్లో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాగా భారీ వర్షాల అలర్ట్ మరోవైపు ఉంది. దక్షిణ కోస్తా జిల్లాలో ప్రస్తుతం ఉన్న వడగాల్పులు, ఉక్కపోత పరిస్థితులు కూడా రెండు, మూడు రోజుల్లో సాధారణంగా మారబోతున్నాయని అంచనా. వచ్చే వారంలో రుతుపవనాల ప్రభావంతో అన్ని జిల్లాల్లో వర్షాలు కురవబోతున్నాయి. ప్రస్తుతం రోహిణి కార్తీ ప్రభావంతో ఎండలు మండుతున్నాయి. మరో రెండు, మూడు రోజుల్లో వర్షాలు కురవడం ప్రారంభమైతే అన్ని ప్రాంతాలు చల్లబడే అవకాశముంది. దీంతో వర్షాల కోసం జనం ఎదురుచూస్తున్నారు.

**కర్నూలు, మే31, ప్రభాతవార్త :** జూన్ రెండో వారంలో రాష్ట్రం అంతటా సాధారణ వర్షాలు కురుస్తాయని చెబుతున్నారు. జూన్ మూడో వారంలో మంచి వర్షాలు కురుస్తాయని, జూన్ చివరి వారం నాటికి రాష్ట్రమంతటా సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. జూన్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని కూడా చెబుతున్నారు. నైరుతి రుతు పవనాలు గురువారం కేరళను ముదాడాయి. లక్షద్వీప్, కేరళలోని కొన్ని ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని, కొన్ని చోట్ల ఇప్పటికే వర్షాలు కురి సేందుకు అనుకూల వాతావరణం ఉందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. ఈసారి సకాలంలో దేశమంతా విస్తరించి భారీ వర్షాలు కురిసే అవకాశం కూడా ఉందని పేర్కొంది. ఈ సంవత్సరం ఆశించిన దాని కంటే ఎక్కువ వర్షాలు కురిసే కారణంగా రైత న్నలకు మేలు జరిగే అవకాశం ఉందని పేర్కొంది. ఈసారి తెలుగు రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు గత సంవత్సరం నైరుతి రుతుపవనాలు తెలుగు రాష్ట్రాల ప్రజలకు చేదు అనుభవాన్ని మిగి ల్చాయి. సరి పడిన వర్షపాతం లేక తెలుగు రాష్ట్రాల్లోని రైతులు ఇబ్బం దులను ఎదుర్కొన్నారు. అయితే ఈసారి అలాంటి పరిస్థితి ఉండ బోదని విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది.

మే 30కి కేరళ తీరాన్ని తాకాయని అక్కడి నుండి దక్షిణ భారతదేశంలో ఉత్తరం వైపు పయనిస్తాయని చెబుతున్నారు. ఈసారి జూన్ 2, 3వ తేదీలలో నైరుతి రుతుపవనాలు ఏపీలో ప్రవేశించనున్నాయి. ఒకవేళ ఏదైనా ఆలస్యం జరిగినా మరుసటి రోజు అంటే రెండు, మూడు తేదీలకు ఏపీలోకి ప్రవేశిస్తాయి....

• వివరాలు 2లో

# కొండెక్కిన.. కూరగాయలు..!

- ఏం కొనలేం....ఏంతినలే...
- భారీగా పెరిగిన కూరగాయల ధరలు....
- ఆందోళనలో సామన్య మధ్యతరగతి జనం...





మార్కెట్‌లో కూరగాయల ధరల పట్టిక చూస్తే పట్టపగలే చుక్కలు కనిపిస్తాయి.. ఏది కొనాలన్నా.. కొండెక్కి కూర్చున్నాయి.సామన్య పేద,మధ్య తరగతి కుటుంబాలకు అందని ద్రాక్షలా మారియి.వర్షం వస్తే ఓకష్టం.. రాకపోతే మరోకష్టం.. అంతా బాగుంటే మార్కెట్‌లో మాయగాళ్ల మోసం.. ధరల దరిద్రం.. పట్టించుకోని ప్రభుత్వం.. మధ్యలో నలిగి పోయేది మాత్రం సామాన్య జనం.

**గోనెగండ్ల మే 31 ప్రభాతవార్త**

ఎండలతో పాటు కూరగాయల ధరలు మండిపోతుడడంతో సామాన్యలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఎండల తీవ్రతవల్ల సాగునీరు లేక పంటల దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది.గత రెండు వారాలుగా కూరగాయలు ధరలు అమాంతంగా ధరలు పెరుగుతున్నాయి.దిగుబడులు తగ్గడం వల్లే ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు అంటున్నారు. ఇలాగైతే ఎలా బతకాలని సామాన్యలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం మాత్రం ధరల నియంత్రణపై చేయడంలో శూన్యం. గోనెగండ్ల మండలంలోని కూరగాయలు పండిన పంటని ఎమ్మిగనూరు,ఆదోని,కర్నూలు,హైదరాబాద్,రాయచూర్, ప్రాంతాలకు తీసుకువెళుత్తారు.మార్కెట్ వ్యాపారులు రైతుల నుంచి తక్కువ ధరలకు కొనుగోలు చేసి వాటిని సంతలో అమ్ముతున్నారు.వంటలో వడేది ప్రధానమైన కూరగాయ టమోట ధర తగ్గింది.టమోట ఒక కీలో రూ.20 ధర పలుకుతుంది. వంకాయలు రూ.60,బెండకాయలు రూ.60,చెవులకాయలు రూ.60, కాకరకాయలు రూ.60, బీరకాయలు రూ.80, ఆళ్లగడ్డలు రూ.60,బీన్స్ రూ.60,బీట్‌రుట్ రూ.60,క్యారెట్టు రూ.60, కూరగాయల ధరలు పలుకుతున్నాయి. కూరగాయల ధరలు అదుపు చేసి సామాన్యులను అదుకొవాలని పలువురు కూలీలు, చిరు వ్యాపారులు వాపోయ్యారు.

ః-సామాన్యులపై భారంః ముల్ల చిన్నరంగూల్‌బాషా ఐరన్‌బండ

కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. నాలాంటి సామాన్య ప్రజలు కొనలేని పరిస్థితి వచ్చింది. కూరగాయలు కొనలంటేనే భయమేస్తోంది. కూరగాయల సంగతి మర్చిపోవాల్సిందే. పేదలకు ఈ ధరలు చాలా భారంగా మారాయి.కారం మెతుకులతో అన్నం సరిపెట్టుకోవాలి. ధరల నియంత్రనకు అధికారులు కృషి చేయాలి .

## పోస్టల్ బ్యాలెట్ మేనేజ్మెంట్ సిస్టం ద్వారా స్వీకరించిన పత్రాలను జాగ్రత్తగా లెక్కించండి

**- జిల్లా ఎన్నికల అధికారి,జిలా కలెక్టరు డా.కె శ్రీనివాసులు**



**నంద్యాల మే 31, ప్రభాతవార్త ప్రతినిధిః** ఈనెల 4వ తేదిన జరగనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు పటిష్టంగా చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టరు డా.కె శ్రీనివాసులు అదేశించారు. శుక్రవారం పాణ్యం మండలం నెరవాడ గ్రామ సమీపంలోని ఆర్జీఎం, శాంతిరాం ఇంజనీరింగ్ ఫార్మసీ కళాశాలల్లో ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన అనంతరం ఈటిపిబిఎంఎస్ పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపు విధానంపై ఏఆర్వోలు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్‌లకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో కలెక్టరు పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి డా.కె శ్రీనివాసులు మాట్లాడుతూ జూన్ 4న నిర్వహించే ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లను పకడ ్బందిగా చేసుకోవాలని సంబంధిత అధికారులను అదేశించారు. ఎలక్ట్రానిక్ ట్రాన్స్ ఫర్ పోస్టల్ బ్యాలెట్ మేనేజ్మెంట్ సిస్టం (ఈటిపిబిఎంఎస్)ను చక్కగా నిర్వహించాలని వాటి లెక్కింపుకు సబంధించి ప్రతే ్యకంగా టెబుల్స్ ను స్కానర్లను ఏర్పాటు చేయించారు. సర్వీసు ఓటర్లు వినియోగించుకున ్న పోస్టల్ బ్యాలెట్ పత్రాలను ఏవిధంగా లెక్కిస్తారు అనేవిధానంపై ఏఆర్వోలు, కౌంటింగ్ సూపర్‌వైజర్లకు కౌంటింగ్ అసిస్టెంట్‌లకు డెమో వెబ్‌సైట్ నందు ప్రాక్టిస్ చేయించడం జరిగింది. ఈటిపిబిఎంఎస్ పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఏకకాలంలో జరుగుతుందని కలెక్టరు తెలిపారు. ముందుగా ఫారం-13సిలోని కవర్ తెరిచి కవరు బయట ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేసి ఒకదాని తరువాత ఒకటి లెక్కించాలన్నారు. క్యూఆర్‌కోడ్ చెక్కింగ్ వల ్ల ఎటువంటి డూప్లికేట్ ఓట్లకు అవకాశం ఉండదన్నారు. మొదటి ఫాం-13సిలో బయటకు కవరు, రెండవ ఫాం-13ఎలో డిక్లరేషన్ ఫాం మూడవది పోస్టల్ బ్యాలెట్ ఉన్న ఫారం-13 బి కవరును వరుస క్రమంలో స్కాన్ చేస్తారు. కవర్ 13సిలో వున్న పోస్టల్ బ్యాలెట్ పేపరు (ఫారం-13బి)ను తెరువబోయే ముందు రిటరి ్నంగ్ అధికారి 13ఎ (ఓటరు డిక్లరేషన్ ఫారం) సరిచూసుకోవాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ పరిశీలన ఫారం 13ఎ డిక్లరేషన్‌లో అంశాలు సరిగా ఉన్నట్లయితే ఫారం-13బి పోస్టల్ బ్యాలెట్ కలిగి వున్న కవరును పరిశీలించాలని కలెక్టరు తెలిపారు.

# సప్తనది జలాలు.. కలుషితం..!

- సంగమేశ్వరం సమీపంలో ఆకుపచ్చగా మారిన జలాలు
- ఉపాధి కోల్పోతున్న మత్స్యకారులు
- జీవరాశులు రోగాలపాలు

నంద్యాల జిల్లాలోని కొత్తపల్లి మండలంలోని సంగమేశ్వరం వద్ద సప్తనది జలాలలోకి వ్యర్థాలు చేరి నీరు అంతా ఆకుపచ్చగ మారడంతో నది తీరం గ్రామాల ప్రజలు భయాంధోళనకు గురౌతున్నారు. తుంగభద్ర, కృష్ణ, వేణి, భీమ, మలాపహారిణి, భవనాసి నదులు సంగమేశ్వరం వద్ద కలుస్తాయి. గత రెండు రోజులుగా సంగమేశ్వరం వద్ద ఎగువ నుంచి కలుషిత నీరు వచ్చి ముదురు ఆకుపచ్చగా మారాయి. దీంతో నదితీరం గ్రామాలైన కొత్తపల్లి, కపిలేశ్వరం, సంగమేశ్వరం, జోనాలగూడెం, బలపాలతిప్పా, పగిడ్యాల మండలంలోని నెహ్రూనగర్, తెలంగాణలోని అమరగిరి, సోమశిల, మంచా లకట్ట, మల్లేశ్వరం గ్రామాల ప్రజలు ఆంధోళన చెందుతున్నారు.



**కొత్తపల్లి,మేప 31,ప్రభాతవార్త:** పశువులు ఆనీరు త్రాగి రోగాల బారిని పడుతున్నాయని, అలాగే చేపలు చని పోవడంతో మత్స్య సంపద తగ్గుతున్నదని ఆంధోళన వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు జిల్లాలోని తుంగభద్ర నది ఒడ్డున ఉన్నా పరిశ్రమల నుంచి వ్యర్థాలతో కూడిన నీటిని వదలడంతోనే సప్తనది జలాలు కలుషితం అవుతున్నాయని సమీప గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతి ఏడాది ఇలాగే జరుగుతున్న ఎవరు పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. రాబోవు వర్షకాలంలో వరద పెరిగే కొద్ది వ్యర్థాలు పెరుగుతాయని, ఈ ఏడాది నీరు కలుషితం కాకుండా ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని నది తీర ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

## స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్ట భద్రత

**- జిల్లా ఎస్పీ**



**నంద్యాల క్రైం, మే 31, ప్రభాతవార్తః** రాష్ట్ర డిజిపి హరిష్‌కుమార్ గుప్తా ఉత్తర్వుల మేరకు నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి పాణ్యం మండలం అర్జీఎం, శాంతిరాం ఇంజనీరింగ్ ఫార్మసీ కళాశాలలోని స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశాని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్ట్రాంగ్ రూంలను అకస్మిక తనిఖీ చేశారు. ఈసందర ్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈవిఎం స్ట్రాంగ్‌రూం చుట్టుపక్కల రెండు కిలోమీటర్ల మేరకు రెడ్‌జోన్ ప్రకటించామని తెలిపారు. స్ట్రాంగ్‌రూంల చుట్టు ఉన్న గణనతలంలో అనధికార డ్రోన్ కార్యకలాపాలను రెండు కిలోమీటర్ల వరకు నిషేధించడం జరిగిందన్నారు. రెడ్‌జోన్ నిబంధనలు అమలులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను అదేశించారు. రెడ్‌జోన్ నిబంధనలు కౌంటింగ్ ప్రక్రియ పూర్తి అయ్యేంత వరకు అమలులో ఉంటాయన్నారు. ఏవరైనా నిబంధనలు అతిక్రమించిన యేడల వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముందస్తు చర్యలుగా రౌడిషీటర్లను, రౌడీమూకలను అదుపులోకి తీసుకొని వారిపై కేసులను నమోదుచేయడం కూడ జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో డిఎస్పీలు, సిఐలు ఉన్నారు.

## పాణ్యం కౌంటింగ్‌కు సిద్ధం..!

**: జూన్ 4న ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్**
**: ఉదయం 8.30 గంటల నుండి ఈవీఎంల కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం**
**: పాణ్యం నియోజకవర్గ ఆర్వో/జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య.**




**కర్నూలు, మే31, ప్రభాతవార్త :** 138 పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గం కౌంటింగ్ జూన్ 4 వ తేదీ ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్, ఉదయం 8.30 గంటల నుండి ఈవీఎంల కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని పాణ్యం నియోజకవర్గ ఆర్వో/జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య పాత్రికేయుల సమావేశంలో తెలియజేశారు. శుక్రవారం కలెక్టరేట్ లోని మిని కాన్ఫరెన్స్ హాల్ లో పాణ్యం నియోజకవర్గం కౌంటింగ్ ఏర్పాట్లపై మీడియా ప్రతినిధులతో పాణ్యం నియోజకవర్గం ఆర్వో/జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. పాణ్యం నియోజకవర్గం ఆర్వో/జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు 2024 లో భాగంగా పాణ్యం నియోజకవర్గానికి సంబంధించిన కౌంటింగ్ రాయలసీమ యూనివర్సిటీలోని మొదటి అంతస్తు ఇంజనీరింగ్ బ్లాక్ లో నిర్వహించడం జరుగుతుందన్నారు. పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి కౌంటింగ్ కొరకు 14 టేబుల్స్ ని ఏర్పాటు చేయడమైందని, పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 14 టేబుల్స్ ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోస్టల్ బ్యాలెట్ కు సంబంధించి దాదాపు 5700 పోస్టల్ బ్యాలెట్ లను 6 టేబుల్స్ ద్వారా రెండు రౌండ్లలో లెక్కించడం జరుగుతుందన్నారు. ప్రతి టేబుల్ కి ఒక అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ ను కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పాణ్యం నియోజకవర్గానికి సంబంధించిన కౌంటింగ్ 26 రౌండ్లలో పూర్తి చేయడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ సిబ్బందికి కౌంటింగ్ పై ఇప్పటికే రెండు..

## వర్షాలొస్తున్నాయ్..!

(మొదటి పేజీ తరువాయి ) :

ఆపై ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని రాయలసీమ మీదుగా తెలంగాణను చేరుకోవడానికి కనీసం ఐదు ఆరు రోజులు సమయం పడుతుంది. ఏపీ,తెలంగాణాలో జూన్ రెండో వారానికి విస్తారంగా వర్షాలు జూన్ 5 నుంచి 8 తేదీల మధ్య తెలంగాణ రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు వచ్చే అవకాశం మెండుగా ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఒకవేళ కాస్త జాప్యం జరిగిన జూన్ రెండో వారంలో రెండు తెలుగు రాష్ట్రాలలోనూ విస్తారంగా వర్షాలు వస్తాయని చెబుతున్నారు. ఈ వర్షాకాలం సకాలంలో తెలుగు రాష్ట్రాల్లోకి వచ్చినట్లయితే రైతులకు మేలు జరుగుతుందని అంటున్నారు. ఈ సారి జూన్ నెలలో సాధారణ వర్షపాతాన్ని మించి వర్షాలు నమోదు అవుతాయని చెబుతున్నారు. జూన్ మాసమే కాదు సెప్టెంబర్ నెల వరకు సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదవుతుందని అంచనా వేస్తున్నారు. జూన్ నుండి సెప్టెంబర్ వరకు సరాసరి వర్షపాతం 87% అయితే 107% దాటి వర్షపాతం నమోదు కావచ్చని అంచనా వేస్తున్నారు.

## పాణ్యం కౌంటింగ్‌కు సిద్ధం..!

(మొదటి పేజీ తరువాయి ) :

పర్యాయాలు శిక్షణ కూడా ఇవ్వడం జరిగిందన్నారు. కౌంటింగ్ సిబ్బంది ఏ టేబుల్ కు ఎవరిని కేటాయించామనే విషయం కౌంటింగ్ రోజు ఉదయమే ర్యాండమైజేషన్ ద్వారా తెలియచేయడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ కేంద్రం దగ్గర ఈవీఎంలకు సంబంధించిన బెల్ కంపెనీ ఇంజనీర్లు కూడా అందుబాటులో ఉంటారన్నారు. కౌంటింగ్ పూర్తి అయిన తర్వాత ఈవీఎం యంత్రాలను కలెక్టరేట్లోని ఈవీఎం గోడౌన్స్ కు చేర్చడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ రోజున కౌంటింగ్ సిబ్బంది, కౌంటింగ్ ఏజెంట్లు ఇతర ఎన్నికల సిబ్బంది ఖచ్చితంగా ఐడెంటి కార్డులు తీసుకొనేరావాలన్నారు.కౌంటింగ్ ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బంది ఎవరు కూడా కౌంటింగ్ హాల్ లోనికి మొబైల్ ఫోన్స్ తీసుకొని రాకూడదని, ఒకవేళ తీసుకుని వస్తే వాటిని మొబైల్ డిపాజిట్ సెంటర్లో డిపాజిట్ చేసి కౌంటింగ్ హాల్ లోకి రావాల్సి ఉంటుందని జాయింట్ కలెక్టర్ తెలియజేశారు..

## కొరటమద్దిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం

– పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : డీఎంఓ కామేశ్వరరావు



**గడివేముల, మే31, ప్రభాతవార్త;** రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ వంటివి ప్రబలకుండా ముందు జాగ్రత్తలో భాగంగా శుక్రవారంనాడు గడివేముల మండలంలోని కొరటమద్ది గ్రామంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా నంద్యాల డీఎంఓ కామేశ్వరరావు, ఏఎంఓ వరప్రసాద్‌రెడ్డి, వైద్యసిబ్బంది, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశావర్కర్లు ఇంటింటికి తిరిగి పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలకు వివరించారు. డీఎంఓ, ఏఎంఓలు మాట్లాడుతూ ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్లల్లో వాడే గచ్చులను శుభ్రంగా ఉంచుకోవాలని, గచ్చులను కడిగిన తర్వాత రెండు గంటలు ఆరబెట్టి నీటిని నింపుకోవాలన్నారు. ప్రతి రెండు వారాలకు ఒకసారి తాగునీటి ట్యాంకులను శుభ్రపరుచుకోవాలని, ప్రతిరోజు నీటిని క్లోరినేషన్ చేసుకోవాలని సూచించారు. పరిసరాల్లో ఉంచిన వాడుక టైర్లు, ఆడుకలో లేని టైర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కొబ్బరి బోండాలు, ప్లాస్టిక్ వంటి వస్తువులు ఇళ్ల పరిసరాల్లో ఉంచకుండా చూడాలన్నారు. కాలువలకు అడ్డంగా రాళ్లను పెట్టడం వల్ల నీరు నిల్వ ఉంటుందని, వాటిని వెంటనే తొలగించుకోవలన్నారు. రోడ్లు, కాలువలను రోజూ శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, ఎప్పటికప్పుడు చెత్త లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం






**గడివేముల, మే31, ప్రభాతవార్త;** మండలకేంద్రమైన గడివేములలో శుక్రవారంనాడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల వైద్యురాలు డాక్టర్ జాబిన్,వైద్యసిబ్బంది ప్రజలకు పొగాకు వాడకం వల్ల కలిగే ఆరోగ్య ప్రమాదాలను వివరించారు. పొగాకు వల్ల ఎన్నో అనారోగ్యాలు వచ్చేందుకు సిద్ధంగా ఉంటాయని, ఇవి అకాల మరనానికి కారణమవుతాయని, ఎన్నో భయంకరమైన వ్యాధుల ప్రమాదాన్ని ఇది కలిగిస్తుందన్నారు. పొగాకును మానేయమని చెప్పేందుకు ప్రతి యేడాది మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. ధూమపానం నెమ్మదిగా మీ ఊపిరితిత్తులను దెబ్బతీస్తుందని, దీర్ఘకాలిక అబ్స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ (సీఓపీడీ) వంటి వ్యాధులకు కారణమవుతుందన్నారు. ఇది న్యుమోనియా, క్షయ వంటి ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్ల ప్రమాదాన్ని కూడా పెంచుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## గుండెపోటును గుర్తించి వైద్యసేవలతో ప్రాణాలు కాపాడిన వెల్దుర్తి సిహెచ్‌సి వైద్యులు

– సమయానికి వైద్యం అందించడంతో నిలిచిన ప్రాణం...



**వెల్దుర్తి,మే31,ప్రభాతవార్త**

మండల కేంద్రమైన వెల్దుర్తి సిహెచ్‌సి వైద్యశాలలో ఓ వైద్యుడు రోగికి వచ్చిన గుండెపోటును గుర్తించి వైద్యసేవలు అందించి ప్రాణాలు కాపాడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.వెల్దుర్తి సిహెచ్‌సిలో గత రెండు రోజుల కిందట బుధవారం మండలంలోని అల్లుగుండు గ్రామానికి చెందిన శ్రీనివాసులు ఛాతిలో నొప్పి అంటూ వైద్యశాలకు వచ్చి ఓపి తీసుకొని వైద్యుని కోసం ఎదురు చూస్తున్న సమయంలో ఆ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న ఎండి జనరల్ మెడిసిన్ వైద్యులు ఏ.సోమశంకరవరప్రసాద్ హూటాహుటీన రోగి వద్దకు చేరుకున్నాడు.సిహెచ్‌సి సూపరింటెండెంట్ డాక్టర్.బాలచంద్రారెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్.ఏ.సోమశంకరవరప్రసాద్ అతనికి ఈసిజి చేయించి గుండెపోటు వచ్చినట్లు గుర్తించి మార్కెట్‌లో రూ.40వేల విలువ గల ఇంజక్షన్ వైద్యశాలలో అందుబాటులో ఉండడంతో వెంటనే ఆ రోగికి ఇంజక్షన్ ఇచ్చి ప్రాణాలు కాపాడాడు.దీంతో పలువురు వైద్యులు అతన్ని అభినందించారు.రోగి ప్రాణాలు కాపాడడంతో రోగి బంధువులు ఆ వైద్యునికి కృతజ్ఞతలు తెలిపారు.

## కౌతాళంలో వైద్యశిబిరం ఏర్పాటు

**కౌతాళంరూరల్, మే31, ప్రభాతవార్త;**

మండలకేంద్రమైన కౌతాళంలోని గ్రామ సచివాలయం-3 పరిధిలో భాగంగా ఆరోగ్యసురక్ష-2 కార్యక్రమాన్ని వైద్యాధికారిణి పావని ఆధ్వర్యంలో నిర్వహించారు. రోగులకు పలు రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు పావని మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రజలకు గ్రామస్థాయిలో వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాల్‌దినకర్, మండల పరిషత్ ఏఓ సత్యన్న, పంచాయతీ కార్యదర్శి బి.శివప్ప, సచివాలయ ఏఎన్ఎంలు, వివిధ భాగాలకు చెందిన డాక్టర్లు, నర్సులు, ఆయాలు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.



## నాగార్జునను పరామర్శించిన మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి



**బనగానపల్లెరూరల్ ,మే 31, ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణానికి చెందిన బీసీ కుటుంబ వీరాభిమాని నాగార్జున గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ కర్నూలు నగరంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స తీసుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటు న్నారు. ఈ విషయం తెలుసుకున్న బనగానపల్లె గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి శుక్రవారం సాయంకాలం వారి ఇంటికి చేరుకుని నాగార్జునను పరామర్శించారు. అలాగే వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. బీసీ రాజారెడ్డి వెంట జక్కు సురేష్, వెంకటప్ప, జక్కు శ్రీను తదితరులు ఉన్నారు.

## రామాంజనేయులును పరామర్శించిన మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి



**బనగానపల్లెరూరల్ ,మే 31, ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలోని తెలుగుపేటకు చెందిన టీడీపీ నాయకుడు, ఎంపిటిసి జక్కు కృష్ణన్న కుమారుడు జక్కు రామాంజనేయులు అనారోగ్యంతో బాధపడుతూ నంద్యాలలోని శాంతిరామ్ ఆసుపత్రి నందు శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న బనగానపల్లె గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి శుక్రవారం సాయంకాలం వారి ఇంటికి వెళ్లి రామాంజనేయులును పరామర్శించారు. అలాగే వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. అలాగే రామాంజనేయులు త్వరగా కోలుకోవాలని బీసీ రాజారెడ్డి ఆకాంక్షించారు. బీసీ రాజారెడ్డి వెంట జక్కు సురేష్ బాబు, వెంకటప్ప, జక్కు శ్రీను తదితరులు ఉన్నారు.

## కేన్సర్ వ్యాధి నివారణపై అవగాహన



**ఆదోనిలీగల్, మే31, ప్రభాతవార్త;** ఆదోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో కేన్సర్ వ్యాధి నివారణ చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. శుక్రవారం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి డాక్టర్లు ఏడు మంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు జ్యోతి ప్రజ్వలన గావించి సదస్సును ప్రారంభించారు. ఏడు మంది మెడికల్ కాలేజీ డాక్టర్ల టీం ఆదోనికి చేరుకుంది. కేన్సర్ వ్యాధి నివారణ చర్యలపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు శ్రీనివాసనాయక్, వాణిశ్రీ మాట్లాడుతూ కేన్సర్ వ్యాధి పట్ల ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించాలని డాక్టర్లకు సూచించారు. నివారణ చర్యలతో వ్యాధిని నియం చేసుకునే అవకాశం కూడా లేకపోలేదని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు ఫించన్‌ను ఏర్పాటుచేయాలి -హెల్పింగ్‌హ్యాండ్స్



**వెల్దుర్తి,మే31,ప్రభాతవార్త :** రైతులకు ఫించన్‌ను ఏర్పాటుచేయాలని హెల్పింగ్‌హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షులు వి.యం.హరిసింహానాయుడు అన్నారు.స్థానిక హెల్పింగ్‌హ్యాండ్స్ సొసైటీ కార్యాలయంలో శుక్రవారం హరిసింహానాయుడు కమిటీ సభ్యులతో కలిసి కోడుమూరు మండలం క్రిష్ణాపురం గ్రామానికి చెందిన రైతు కురువ హనుమంతును శాలువతో సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి రైతులే వెన్నముక లాంటి వారని అయితే నేడు రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారయ్యింది.వారి వెన్నముక విరిగిపోయి,ఆర్థికభారంతో,ప్రకృతి వైపరీత్యాలతో నలుగుతూ ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.కర్నూలు జిల్లాలోని జిల్లెడుబుడకల గ్రామంలో యువరైతు హరిచంద్ర 3 రోజుల కిందట ఆత్మహత్య చేసుకున్నాడని ఆవేదన చెందారు.రైతులను మనమంతా కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.రైతులకు సాగునీరు,నాణ్యమైన విత్తనాలు,కనీస గిట్టుబాటుధర అందించాలని అదేవిధంగా నిరుపేద రైతులకు ప్రతి నెల రూ.5వేలు ఫించన్‌ను ఏర్పాటుచేయాలని ఆయన ప్రభుత్వాలను కోరారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సీనియర్ సిటిజన్ నాగప్ప,ఈశ్వరయ్య,సిద్దనగట్టు రమేష్,అంజి తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు లేని బాణసంచా సీజ్

**వెల్దుర్తి,మే31,ప్రభాతవార్త :** వెల్దుర్తి బాలుర హైస్కూల్ సమీపంలోని ఓ వ్యాపారి గోడౌన్‌లో అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన బాణసంచాను శుక్రవారం పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు.పత్తికొండ డిఎస్పీ ఆదేశాల మేరకు వెల్దుర్తి సర్కిల్ సిఐ సురేష్‌కుమార్‌రెడ్డి,వెల్దుర్తి ఎస్సై చంద్రశేఖర్‌రెడ్డి సోదాలు చేసి నిల్వ ఉంచిన రూ.20వేల రుపాయల విలువ గల బాణసంచాను సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు

– వెల్దుర్తి పిఎస్‌లో రాజకీయనాయకులతో సమావేశం..

– జూన్6వ తేది వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుంది..



**వెల్దుర్తి,మే31,ప్రభాతవార్త :** ప్రజల శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే అటివంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని వెల్దుర్తి సర్కిల్ సిఐ సురేష్‌కుమార్‌రెడ్డి రాజకీయనాయకులకు హెచ్చరించారు.స్థానిక వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం సిఐ ఆధ్వర్యంలో ఎస్సై చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన వివిధ పార్టీల రాజకీయనాయకులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూన్4న కౌంటింగ్ ఉందని ఆ రోజున ఆయా గ్రామాల నాయకులు వారి అనుచరులకు, కార్యకర్తలకు ఎటువంటి గొడవలకు దిగవద్దని ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు.అలాకాదని ఎవరైనా సరే చిన్న ఘర్షణకు దిగిన కేసులు తప్పవన్నారు.జూన్6వ తేది వరకు ఎన్నికల కోడ్ అమలులోనే ఉంటుందని ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్నారు.ఎన్నికల ఫలితాలు వచ్చాక గెలిచిన వారు బాణసంచా కాల్చడం,ర్యాలీలు ,ఊరేగింపులు చేయరాదన్నారు.ఓడిన వారు సంయమనం పాటించాలన్నారు.అందరు పోలీస్‌శాఖకు సహకరించాలన్నారు.ఈ కార్యక్రమంలో అన్ని పార్టీల రాజకీయ నాయకులు, ఎస్‌బి హెడ్‌కానిస్టేబుల్ ఖాజాహుస్సేన్,పోలీస్‌సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్,ప్రైవేట్ విద్యాసంస్థల్లో అక్రమ అడ్మిషన్లకు కళ్లెం వేయాలి

**ఆదోని,మే 31,ప్రభాతవార్త :** కార్పొరేట్,ప్రైవేట్ విద్యాసంస్థల్లో పాఠ్యపుస్తకాలు,అడ్మిషన్లు అరికట్టాలని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు అఖండ డిమాండ్ చేశారు. శుక్రవారం డిప్యూటీ డిఈఓ ఇంచార్జ చంద్రశేఖర్‌కి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాడమిక్ ఇయర్ స్టార్ట్ కాకముందే ప్రభుత్వ విద్యాహక్కు చట్టాన్ని తూట్లు పొడుస్తూ ముందస్తు అడ్మిషన్లు,పాఠ్యపుస్తకాలు అమ్ముతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు మహేష్,రసూల్,వీరేష్,సునీల్,సంతోష్,వంశీ పాల్గొన్నారు.

## ఏపిఓ రైతులకు అవగాహన కల్పించడంలో విఫలం..

– మొక్కలను పర్యవేక్షణ అధికారి కన్నెత్తి చూడడం లేదు..

**పత్తికొండ,మే 31,ప్రభాతవార్త**

పండ్లు,పూలు మొక్కలపై రైతులకు అవగాహన కల్పించడంలో ఏపిఓ పూర్తిగా విఫలం చెందాడని పలువురు రైతులు వాపోతున్నారు. జాబ్‌చార్టు ప్రకారం పనులు నిర్వహించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. మండలంలో 400ఎకరాలపైచిలుకు పండ్లు,పూలమొక్కలు వేయాలని టార్గెట్ ఉంది. మండలంలో 20రకాల పండ్ల తోటలపైన పండ్లు,పూలు తోటలపైన ఎస్‌సి,ఎస్‌టి,చిన్నకారు రైతుల పొలాల్లో నాటించాల్సి ఉంది.రైతులకు ప్రతి గ్రామంలో అవగాహన కల్పించడంలో పూర్తిగా విఫలం చెందారు. అయితే ఏపిఓ మాత్రం తూతూమంత్రంగా పర్యక్షించి చేతులు దులుపుకుంటున్నారని మండిపడ్డారు. ఇలాంటి అధికారులపై ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని రైతులు,ప్రజలు కోరుతున్నారు.

## సిడిపిఓ నిర్మలాదేవి పదవీ విరమణ

**ఆస్పరి,మే 31,ప్రభాతవార్త**

ఆస్పరి,దేవనకొండ సెక్టర్‌లో సిడిపిఓ విధులు నిర్వహిస్తున్న నిర్మలాదేవి పదవీ విరమణ సభ నిర్వహించారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయం హాల్‌లో సిడిపిఓ నిర్మలాదేవికి ఐసిడిఎస్ సిబ్బంది ఆద్వర్యంలో ఘనంగా పదవీ విరమణ సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలూరు సిడిపిఓ మద్దమ్మ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని వారు చేసిన సేవలే చిరస్థాయిగా చిలిచి పోతాయని,నిర్మలాదేవి విధులలో అంకిత భావంతో పనిచేసి స్త్రీ,శిశు సంక్షేమ శాఖకు గౌరవం తెచ్చారని తెలిపారు. చిన్నారులకు,బాలింతలకు,గర్బవతులకు పౌష్టికాహారంంపై అవగాహన కల్పిస్తూ వారి సంరక్షణకు కృషి చేశారని తెలిపారు. అనంతరం నిర్మలాదేవికి శాలువాలు కప్పి,పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆస్పరి,దేవనకొండ మండలాల ఐసిడిఎస్ సూపర్‌వైజర్స్ శివలింగమ్మ,పద్మావతి,అంగన్‌వాడీ కార్యకర్తలు,విశ్వకుమారి,రాధమ్మ,రసూల్ బేగం,శ్రీలత,రాణి,ఆఫీసు సిబ్బంది తదితరలున్నారు.

## ఇంటర్మీడియట్ అకాడమిక్ క్యాలెండర్ విడుదల

– నేటి నుంచి ఇంటర్ కళాశాలలు ప్రారంభం



**నంద్యాల విద్య, మే 31, ప్రభాతవార్త ః**

రాష్ట్రంలోని అన్ని ఇంటర్మీడియట్ పరిధిలో గల జూనియర్ కళాశాలలకు అకాడమిక్ క్యాలెండర్‌ను రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు సెక్రెటరీ సురబ్‌గౌర్ విడుదల చేసినట్లు నేటి నుంచి అన్ని కళాశాలలు తరగతులు ప్రారంభించాలని అదేశాలు జారీచేసినట్లు ఇంటర్మీడియట్ బోర్డు అధికారి ఎస్ఎస్‌వి గురువయ్యశెట్టి తెలిపారు. 2024-25 సంవత్సరానికి సంబందించి అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం 222 రోజులు పనిదినాలు ఉండాలన్నారు. మొదటి యూనిట్ పరీక్షలు జూలై 29 నుంచి 31 వరకు ఉంటాయని, రెండవ యూనిట్ పరీక్షలు పరీక్షలు ఆగష్టు 29 నుంచి 31వ తేదీ వరకు ఉంటాయని, క్వార్టలి పరీక్షలు సెప్టెంబర్ 23 నుంచి 28వ తేదీ వరకు ఉంటాయని తెలిపారు. దసరా సెలవులు అక్టోబరు 3వ తేదీ నుంచి 13వ తేదీ వరుకు ఉంటాయని తెలిపారు. మూడవ యూనిట్ పరీక్షలు అక్టోబరు 21 నుంచి 23వ తేదీ వరకు, నాల్గవ యూనిట్ పరీక్షలు నవంబరు 21 నుంచి 23 వరకు ఉంటాయన్నారు. అఫ్రెర్లి పరీక్షలు డిసెంబరు 16 నుంచి 21 వరకు ఉంటాయి. సంక్రాంతి సెలవులు 2025 జనవరి 13 నుంచి 18 వరకు ఉంటాయన్నారు. ఫ్రీఫైనల్ పరీక్షలు ఫిబ్రవరి మొదటివారంలో ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి నెలాఖరులో, పబ్లిక్ పరీక్షలు మార్చి మొదటివారంలో నిర్వహిస్తామని ఇందుకు అన్నికళాశాలల యాజమాన్యాలు ఈ అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం విధులు నిర్వహించాల్సి ఉంటుందని ఇంటర్మీడియట్ బోర్డు సెక్రెటరీ అదేశించినట్లు ఆర్ఐఓ తెలిపాపారు.

## ప్రభుత్వ సర్వజన వైద్యశాల నూతన సూపరింటెండెంట్‌గా డా.సి ప్రభాకర్‌రెడ్డి



**కర్నూలు హాస్పిటల్, మే 31, ప్రభాతవార్త ః** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల నూతన సూపరింటెండెంట్‌గా బాధ్యతలు తీసుకున్నట్లు డా.సి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆసుపత్రిని ప్రక్షాళన చేస్తానని తెలియజేశారు. ఆసుపత్రిలో సమస్యలున్న వాటిపై ప్రత్యేక దృష్టిపెడతానని తెలిపారు. అనంతరం సెక్యూరిటి, శానిటేషన్, పేస్ట్ కంట్రోల్‌పై ప్రత్యేక దృష్టిపెడతానని తెలిపారు. ఈకార్యక్రమానికి కర్నూలు వైద్య కళాశాల అడిషనల్ డిఎంఈ అండ్ ప్రిన్సిపాల్ డా.చిట్టి నరసమ్మ, సిఎస్ఆర్ఎంఓ డా.వెంకటేశ్వర్‌రావు, డిప్యూటి సిఎస్ఆర్ఎంఓ డా.హేమనలిని, ఆర్ఎంఓ డా.వెంకటరమణ, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ డా.శివబాల నగాంజన్, డా.కిరణ్‌కుమార్, ఆసుపత్రి ఏడి అనిల్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల ఫ్లాగ్‌మార్చ్ నిర్వహణ

**నంద్యాల క్రైం, మే 31, ప్రభాతవార్తః**

ఎన్నికల కౌంటింగ్ సమీపిస్తున్న నేపధ్యంలో శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా ముందస్తుగా నివారించాలనే ఉద్దేశంతో జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి అధ్వర్యంలో పట్టణంలోని శ్రీనివాససెంటర్, గాంధీచౌక్, ముల్లాన్ పేట, ఆత్మకూరు బస్టాండ్, ఫరూక్ నగర్, పద్మావతీనగర్, టెక్కె ప్రాంతాల్లో శుక్రవారం పోలీసులు ఫ్లాగ్‌మార్చ్‌ను నిర్వహించారు. జూన్ 4 వరకు ఎన్నికల కోడ్‌తో పాటు 144 సెక్షన్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. అలాగే పోలీస్ 30 యాక్టు అమలులో ఉంటుందన్నారు. ఏవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. హింసాత్మకమైన సంఘటనలకు పాల్పడితే చట్టం తనపని తాను చేసుకుపోతుందని సూచించారు. ప్రజలందరు సమన్వయం పాటిస్తు పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్, డిఎస్పీ రవీంధ్రనాధ్‌రెడ్డి, నంద్యాల సబ్‌డివిజన్ ఇన్‌స్పెక్టర్లు చలపతి, నరసింహులు, రాజారెడ్డి, శివకుమార్‌రెడ్డి, ఇస్మాయిల్, రిజర్వు ఇన్‌స్పెక్టరు శ్రీనివాసులు, సబ్ ఇన్‌స్పెక్టర్లు మల్లిఖార్జున, వెంకటసుబ్బయ్య, నవీన్‌బాబు, స్పెషల్ పార్టీ సిబ్బంది స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

## పొగాకుకు దూరంగా ఉండండి ఆరోగ్యాన్ని కాపాడుకోండి



**బేతంచెర్ల ,మే 31, ప్రభాతవార్త:** ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవం సందర్భంగా పొగాకుకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డాక్టర్ వెంకటేశ్వర్లు, బ్రహ్మకుమారిలు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక శేషారెడ్డి ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పొగాకును ఏ రూపంలో తీసుకున్నా అనారోగ్యానికి గురికాక తప్పదన్న విషయం ప్రతిఒక్కరు గుర్తించాలన్నారు. పొగ త్రాగడం, గుట్కాలు తినడం మానేస్తే ఎన్నో దీర్ఘకాలిక వ్యాధుల నుండి బయటపడే అవకాశం ఉందన్న విషయాన్ని గుర్తించాలన్నారు. పొగాకు కారణంగా యువతీ యువకులతోపాటు అన్ని వయస్సుల్లో ఉన్న వారు అనారోగ్యానికి గురవుతున్న జాబితాలో భారతదేశం కూడా ఉందన్నది ప్రతిఒక్కరం గుర్తించాలన్నారు. పొగాకుకు దూరంగా ఉండి ఆరోగ్యమైన భారతదేశ నిర్మాణంలో ప్రతిఒక్కరు పాలు పంచుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారిలతోపాటు అంకన్న, వైద్యశాల సిబ్బంది ఉన్నారు.

## పదవీ విరమణ సన్మాన కార్యక్రమం

**బనగానపల్లె ,మే 31, ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలోని మండల విద్యాశాఖ కార్యాలయం నందు మండల విద్యాశాఖ అధికారి పి.స్వరూప అధ్యక్షతన పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు జి.డేవిడ్ నెహెమ్యా, కె.పుల్లయ్య, టి.ఎం.డి.షర్ఫుద్దీన్‌లను పూలమాలలు, దుశాలువలతో ఘనంగా సన్మానించారు. యూటీఎఫ్ బనగానపల్లె మండలశాఖ అధ్యక్షులు ఎన్.ప్రతాప్, యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కన్వీనర్ యు.దస్తగిరి, యూటీఎఫ్ జిల్లా సహ అధ్యక్షులు కె.సత్యప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి పి.స్వరూప మాట్లాడుతూ శుక్రవారం పదవీ విరమణ పొందేటువంటి ఉపాధ్యాయులు ఉద్యోగ జీవితంలో నిరంతరం కష్టపడి, శ్రమపడి, పట్టుదల, ఓర్పుతో విద్యార్థులను తీర్చిదిద్దారన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కొరకు అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. నేటి ఆధునిక సమాజంలో ఉపాధ్యాయులు సాంకేతికతను అందిపుచ్చుకుని విద్యార్థులను తీర్చిదిద్దుటలో సఫలీకృతమయ్యారని ఆమె అన్నారు. వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో జీవించాలని మనసారా కోరుకుంటున్నానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహ అధ్యక్షులు కె.సత్య ప్రకాష్, యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కన్వీనర్ యు.దస్తగిరి, ఆర్థిక కార్యదర్శి ఎం.విజయ్‌కుమార్, మండల అధ్యక్షులు ఎన్.ప్రతాప్, మండల సీఆర్పీలు శివరామమద్దిలేటి, ప్రసాద్, సుధాకర్, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ చౌడేశ్వరిదేవికి వైభవంగా పల్లకి మహోత్సవం



**బనగానపల్లెరూరల్ ,మే 31, ప్రభాతవార్త:** బనగానపల్లె మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయం నందు శుక్రవారం సందర్భంగా అమ్మవారికి శాస్త్రోక్తంగా మరియు వైభవోపేతంగా పల్లకి మహోత్సవం నిర్వహించారు. ఈ మేరకు వేకువజామునే అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని అందంగా అలంకరించి పల్లకి నందు కూర్చుండజేసి ఆలయ ప్రాంగణంలో పల్లకి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తదనంతరం అక్కడికి వచ్చిన భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ పల్లకి మహోత్సవాన్ని తిలకించేందుకు నందవరం గ్రామ ప్రజలతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొని తరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డియే కూటమి అధికారంలోకి రానుంది

**-బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగరూరు రాఘవేంద్ర**



**కర్నూలు విద్య, మే 31, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డియే కూటమి అధికారంలోకి రాబోతుందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగరూరు రాఘవేంద్ర పేర్కొన్నారు. శుక్ర వారం భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందరేశ్వరిని నగరూరు రాఘవేంద్ర భేటిఅయ్యారు. ఈసందర ్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డియే కూటమి అధికారంలోకి వస్తుందని రాష్ట్రంలో ఎన్టియే కూటమితో కలిసి పోటీచేసిన అభ్యర్థులు జోష్‌లో మునిగితేలుతున్నారని పేర్కొన్నారు. ఈసందర ్భంగా ఆయన కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు.

# బైక్ అదుపుతప్పి విద్యుత్ స్థంబానికి డీ - వ్యక్తి మృతి



**జూపాడుబంగ్లా, మే 31, ప్రభాతవార్త :** జూపాడుబంగ్లా మండలం పారుమంచాల గ్రామానికి చెందిన జగ్గు వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావులు శుక్రవారం బైక్ పై జూపాడుబంగ్లా నుండి పారుమంచాలకు వెళ్ళుతుండగా తంగడంచ చెక్ సమీపంలోని మలుపు దగ్గర ద్విచక్రవాహనం అదుపుతప్పి విద్యుత్ స్థంభాన్ని డీకొంది. ఈ ప్రమాదంలో జగ్గు వెంకటేశ్వర్లు (40)అక్కడికక్కడే మ ృతి చెందాడు. నాగేశ్వరావు తీవ్రగాయాలకు గురైయారు. మద్యం మత్తులో బైక్ నడుపుతుండగా అదుపుతప్పి విద్యుత్ స్థంభానికి డీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని ప్రత్యక్షసాక్షులు తెలిపారు. ఈ సమాచారం తెలుసుకున్న ఏఎస్ఐ మేరి జయంతి సంఘటనా స్థలం వద్దకు వెళ్లి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయాలకు గురైన నాగేశ్వరావును చికిత్స నిమిత్తం 108 వాహనంలో నందికొట్కూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కర్నూలులోని బుదవారుపేటకు చెందిన వెంకటేశ్వర్లు పారుమంచాలకు గ్రామానికి చెందిన శ్యామలను వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. గత మూడు సంవత్సరాల క్రితం జోవనోపాది కోసం వెంకటేశ్వర్లు పారుమంచాల గ్రామానికి వచ్చినట్లు స్థానికులు తెలిపారు. ఈ సంఘటనపై మ ృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, శవాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఏఐ లక్ష్మినారాయణ తెలిపారు,

# శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల మాక్‌డ్రిల్ నిర్వహన

**- చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు - జిల్లా ఎస్పీ**



**నంద్యాల క్రైం, మే 31, ప్రభాతవార్త :** ఓట్ల లెక్కింపు అనంతరం ఏవరైనా అవాంఛనీయ సంఘటనలకు, హింసాత్మక చర్యలకు పాల్పడితే ఎటువంటి వారినైనా ఉపేక్షించేది లేదని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి హెచ్చరించారు. కళ్లకు కట్టినట్టుగా శుక్రవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అల్లర్లు చేసే అల్లరి మూకలను ఏవిధంగా సంఘటన స్థలం నుంచి తరిమికొట్టాలో, విధ్వంసానికి ప్రయత్నించేవారిని అణచివేసే పరిస్థితులు ఏవిధంగా అదుపులోకి తీసుకువచ్చేందుకు, ఎలా నడుచుకోవాలో, గాయపడినవారికి చికిత్స అందించడం, సామాన్యప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడడం మొదలగు సన్నివేశాలు కళ్ళకు కట్టినట్లుగా సన్నివేశాలను ప్రదర్శించామన్నారు. ఏవరైనా అల్లరి సృష్టిస్తే శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఎన్నికల కౌంటింగ్ పూర్తి అయ్యేవరకు నియమావళి అమలులో ఉంటుందన్నారు. 144 సెక్షన్, 30 పోలీస్‌యాక్టు అమలులో ఇప్పటికే ఉందన్నారు. ఏవరైనా చట్టాన్ని అతిక్రమించి హింసాత్మక చర్యలకు పాల్పడితే అట్టివారిపై చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజల ధనమాన ప్రాణనష్టం వాటిల్లకుండా చేపట్టె చర్యలను పోలీస్ మాక్‌డ్రిల్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. పోలీసులు, అల్లరిమూకల మధ్య గొడవలు జరిగిన విషయాల్లో కల్పిత పాత్రలతో, పోలీస్‌లు అందోళనకారులుగా వేషం వేసి రాళ్ల విసిరినట్లు చేశారు. అనంతరం అల్లరిమూకలపై పోలీసులు టియర్‌గ్యాస్, తుపాకులతో ఫైరింగ్ దృశ్యాలను అసక్తికరంగా చిత్రీకరించారు. ఈకార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్, డిఎస్పీ రవీంధ్రనాద్‌రెడ్డి, సిఐలు నరసింహులు, చలపతి, రాజారెడ్డి, శివకుమార్‌రెడ్డి, దస్తగిరిబాబు, రిజర్వు ఇన్‌స్పెక్టరు శ్రీనివాసులు, మల్లిఖార్జున, వెంకటసుబ్బయ్య, స్పెషల్ పార్టీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదాలు జరుగకుండ పటిష్టమైన చర్యలు చేపట్టండి

**:- మెయిన్ రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేస్తే జరిమానా**

**:- పెండింగ్‌లో ఉన్న రోడ్డు మరమత్తుల పనులను త్వరితగతిన పూర్తిచేయండి**

**:- రోడ్డు ప్రమాదంలో మరణించిన వారిని పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయండి**

**:- మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు :- సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ**



**ఆదోని,మే 31,ప్రభాతవార్త :** వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించి ప్రమాదాలు జరుగకుండ పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో డివిజన్ స్థాయి రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ గత సమీక్షలు జరిగిన రోడ్ సేఫ్టీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల గురించి ఆరాతీశారు. పట్టణంలో కొత్త బ్రిడ్జి నందు ఏర్పడిన గుంతలను పూడ్చి మరమత్తులను పూర్తిచేయాలని ఆర్ అండ్ బి అధికారులకు ఆదేశించారు. కొత్త బస్టాండ్ సమీపంలో రోడ్డుపై పశువులు ఎక్కువగా ఉండడం వల్ల వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా పశువుల యాజమాన్యానికి తమ పశువులను తీసుకెళ్లాలని లేనిపక్షంలో గోశాలకు తరలించడం జరుగుతుందని హెచ్చరించారు. పెద్దమార్కెట్ ఏరియాలో పార్కింగ్ సమస్య ఎక్కువగా ఉందని వాటిపై చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులు తెలియజేశారు. మెయిన్ రోడ్డుపై పార్కింగ్ చేస్తున్న వాహనాలపై జరిమానాలు వేయాలని ట్రాఫిక్ పోలీసులకు ఆదేశించారు. మెయిన్ రోడ్లపై నిబంధనలకు విరుద్ధంగా ఏవైన కట్టడాలు జరిగితే విచారణ చేసి తొలగించాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. అలాగే గుంతలు ఉంటే వాటిని గుర్తించి పూడ్చి వాటి మరమత్తులు పూర్తిస్థాయిలో చేపట్టాలన్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారిని పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టాలన్నారు. వాహనదారులు భద్రత కోసం ద్విచక్ర వాహనాల్లో తప్పక హెల్మెట్ ధరించాలన్నారు. ఓవర్ లోడ్,ఓవర్ స్పీడ్ వాహనాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. స్కూల్ ఆటోలో ఎక్కువ సంఖ్యలో ప్రయాణిస్తుంటే వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే చోట ఆయొక్క ప్రదేశాన్ని బ్లాక్ స్పాట్‌గా గుర్తించి అక్కడే నేమ్ బోర్డ్ ్ల ఏర్పాటు చేయాలన్నారు. రోడ్ సేఫ్టీ నిబంధనలను వాహనదారులకు అవగాహన కలి ్పించి ప్రమాదాలకు గురికాకుండ ప్రజలకు తెలియజేయాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఓ నాగేంద్ర,మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శిశిర దీప్తి,రోడ్డు భవనాలు శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణారెడ్డి,పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటప్రసాద్,ఆర్టీసి డిపో మేనేజర్ మమహ్మద్ రఫీ,మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మంజునాథ్,రెవెన్యూ అధికారులు తదితరులున్నారు.

# చల్లని కబురు...కేరళను తాకిన నైరుతి రుతుపవనాలు



**నంద్యాల, మే 31, ప్రభాతవార్త ప్రతినిధి:** దేశ ప్రజలకు వాతావరణశాఖ చల్లని కబురు వినిపించింది. దేశ వ్యవసాయ అధారిత ఆర్థిక వ్యవస్థ జీవనాడి అయిన నైరుతి రుతుపవనాలు దేశ ప్రధాన భూభాగంలోకి ప్రవేశించినట్లు తెలిపింది. ఇవి గురువారం ఉదయం కేరళను తాకాయని ఐఎండి అధికారికంగా వెల్లడించింది. లక్షద్వీప్ కేరళలోని కొన్ని ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని ఇప్పటికే వాతవారణశాఖ అంచనా వేసింది. రాబోయే మూడు, లేదా నాలుగు రోజుల్లో రుతుపవనాలు ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించే అవకాశం ఉందని తెలిపింది. గత కొన్నిరోజులుగా పలు రాష్ట్రాల్లో రికార్డుస్థాయిలో ఉష్ో ్ణగ్రతలు నమోదుఅవుతున్న వేళ ఈ కబురు ప్రజలకు ఊరట కల్పించింది. మనదేశంలో 52 శాతం నికరసాగు భూమి ఇప్పటికే వర్షపాతంమే ప్రధాన అధారం దేశం మొత్తం వ్యవసాయ ఉత్పత్తిలో ఈ సాగుభూమి నుంచి ఏకంగా 40శాతం దిగుబడి వస్తుంది. అందుకు భారత ఆహారభద్రత ఆర్థిక స్థిరత్వంలో నైరుతి రుతుపవనాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఇక ఈఏడాది లానినా అనుకూల పరిస్థితులు భూమధ్యరేఖ వద్ద పసిఫిక్ మహాసముద్రం చల్లబడడం ఆగష్టు సెప్టెంబరు నాటికి ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున ఎక్కువ రుతుపవనాలు సీజన్‌లో సాధారణం కంటే ఎక్కువ వర్షం కురుస్తుందని గత నెలలో ఐఎండి అంచనా వేసింది. వాయువ్య తూర్పు ఈశాన్య రాష్ట్రాలోని కొన్ని ప్రాంతాలు మినహా దేశంలోని చాల ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉందని పేర్కొంది. 1952 నుంచి 2023 వరకు ఎల్‌నినో తరువాత లానినా వచ్చిన సందర్భల్లో భారత్‌లో 9 సార్లు మంచి వర్షాలు కురిశాయని తెలిపింది. అందుకు అనుగుణంగానే ఈ ఏడాది రుతుపవనాల కదలిక ఉందని వివరించింది.

# ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు - డీఎస్పీ

**చాగలమర్రి,మే 31, ప్రభాతవార్త:** జూన్ 4వ తేదిన నిర్వహిస్తున్న పార్లమెంట్, శాసనసభ ఎన్నికల కౌంటింగ్‌ను దృష్టిలో ఉంచుకుని తాలుకాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఆళ్లగడ్డ డీఎస్పీ షర్పద్దీన్ తెలిపారు. శుక్రవారం చాగలమర్రి పట్టణంలోని స్థానిక అడ్డవాగు సెంటర్ నుంచి సీఐలు, ఎస్ఐలు, సాయుధ బలగాలతో మల్లివేముల బస్టాండ్, మెయిన్ బజారు, చిన్నమకానం, ముత్యాలపాడు బస్టాండ్, పెద్దమకానం, గాంధీ సెంటర్ మీదుగా పోలీస్‌స్టేషన్ వరకు కవాతు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ ముగిసేంత వరకు 144 సెక్షన్, పోలీస్‌యాక్ట్ 30 అమలులో ఉంటుందని ఎక్కడ కూడా విజయోత్సవ ర్యాలీలు, సంబరాలు, బాణసంచా పేల్చడం వంటి వాటిని నిషేధించడం జరిగిందన్నారు. కౌంటింగ్ హాల్ వద్దకు అభ్యర్థులతోపాటు ఏజెంట్లు మాత్రమే వెళ్లాలని ఇతరులు ఎవరు కూడా వెళ్లకూడదన్నారు. కౌంటింగ్ సందర్భంగా ఘర్షణలకు పాల్పడితే వారి పై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. శిరివెళ్ల మెట్ట వద్ద పలు రహదారుల్లో



పోలీస్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడం జరుగుతుందని అందువల్ల నాయకులుకాని, కార్యకర్తలుకాని, ప్రజలుకాని కౌంటింగ్ హాల్ వద్దకు వెళ్లవద్దని సూచించారు. చెక్‌పోస్టుల వద్ద చెకింగ్ చేసిన తరువాతనే అభ్యర్థులతోపాటు కౌంటింగ్ ఏజెంట్లు మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు. 144సెక్షన్, పోలీస్‌యాక్ట్ 30 అమలులో ఉండడం వల్ల ప్రజలు గుంపుగుంపులుగా ఉండవద్దని తమ ఇళ్లవద్దనే కౌంటింగ్‌ను పర్యవేక్షించుకోవాలని సూచించారు. సీఐలు హనుమంతు నాయక్, చంద్రబాబు, ఎస్ఐలు రమణయ్య, నరసింహులు, నాగేశ్వరరావు, రామాంజనేయరెడ్డి, పోలీస్ సిబ్బంది, సాయుధ బలగాలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములలో అక్రమ మట్టి తవ్వకాలు





**ప్యాపిలి మే31(ప్రభాతవార్త):** పరస్పరం ఆరోపణలు, విమర్శలతో కత్తులు దూసే రాజకీయ నాయకులు ఏకమై ప్రభుత్వ భూములలో అక్రమంగా జరుగుతున్న మట్టి తవ్వకాలను డిమాండ్ చేయడం ప్యాపిలిలో విశేషంగా మారింది. ప్రభుత్వ స్థలాలలో బోర్డులు ఏర్పాటు చేసి అక్రమంగా మట్టి తవ్వకాలపై, ప్యాపిలిలో చెరువును ఆక్రమించి ప్లాట్లు వేసి విక్రయిస్తున్న రియల్‌ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం రెవెన్యూ అధికారికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడిఎం అధికారులతో అనుమతులు తీసుకున్నామని అబద్దాలు చెప్పి కొండలలో మట్టి తవ్వకాలు చేస్తున్నారని పిర్యాదు చేశారు. అదే విధంగా 20 ఎకరాలు ఉన్న చెరువును రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి ప్లాట్లు వేసి విక్రయిస్తున్నారని, ఆక్రమణల వల్ల చెరువు ఐదు ఎకరాలకు కుదించుకుని పోయిందని వాపోయారు. దీనికి తోడు చెరువులోకి నీళ్ల రాకుండ అడ్డంగా మట్టిని వేశారని పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలాలలో ఇష్టానుసారంగా బోర్డులు పెట్టి ఆక్రమిస్తున్నారని ధ్వజమెత్తారు. చెరువులో నీళ్ల రాకపోతే రైతులు ఏ విధంగా సాగు చేస్తారని నిలదీశారు. పంచాయితీ అధికారుల అనుమతి లేకుండ వేసిన లేఅవుట్లు నాయకులకు ఇంతవరకు ఎందుకు కనిపించలేదాని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నాయకులకు, అధికారులకు ముడుపులు సమర్పించి రియల్‌ఎస్టేట్ వ్యాపారులు అక్రమాలకు పాల్పడుతున్నారనేది జగమెరిగిన సత్యమని ప్రజలు చమత్కరిస్తున్నారు. రియల్ దందాలో నాయకులకు వాటాలు ఉన్నాయనే అనుమానాలను వ్యక్త ం చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికి నాయకులు ఏకమై ప్రభుత్వ భూములను, చెరువులను రక్షించాలని అధికారులకు విన్నవించారు. ఉప సర్పంచ్ గద్దం భువనేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్పీపి టి.శ్రీనివాసులు, రజనీకాంత్, రఘనాథ్‌రెడ్డి, బోరెడ్డి కృష్ణారెడ్డి, రామచంద్రరెడ్డి, టి.వెంకటేష్, అంజి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# ఎండియు వాహనాల ద్వారా కార్డుదారులందరికి ఇంటివద్దనే సరుకుల పంపిణి



**నంద్యాల, మే 31, ప్రభాతవార్త ప్రతినిధి:** నంద్యాల జిల్లాలో ప్రజాపంపిణి వ్యవస్థ ద్వారా కార్డుదారులందరికి ఉచితంగా బియ్యం మరియు సబ్సిడి ధరపై చక్కెర ఎండియు వాహనదాల ద్వారా ఇంటివద్దనే పంపిణి చేయడం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం అదేశాల మేరకు జిల్లా జాయింట్ కలెక్టరు టి రాహుల్‌కుమార్‌రెడ్డి సూచనల మేరకు పంపిణి చేయడం జరుగుతుందన్నారు. మార్చి నెల నుండి బియ్యం బదులు మూడు కిలోల వరకు జొన్నలు ఉచితంగా రైస్ కార్డుదారులకు పంపిణి చేయడం జరుగుతుందన్నారు. మే మాసంలో 533.182 మెట్రిక్ టన్నుల జొన్నలను 2,05,839 కార్డుదారులకు బియ్యం బదులుగా 3 కిలోల జొన్నలను తీసుకోవడం జరిగింది. అదేవిధంగా జూన్ నెల నుండి కూడ చౌకధరల దుకాణాల నుండి ఎండియు వాహనాల ద్వారా జిల్లాలోని కార్డుదారులందరికి 3కేజిల చొప్పున జొన్నలు మరియు రాగులు ఇంటివద్దనే పంపిణి చేయడం జరుగుతుందన్నారు. కార్డుదారులందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టరు తెలియజేశారు.

# ధూమపానం వల్ల క్యాన్సర్, ఊపిరితిత్తుల వ్యాధులు వచ్చే అవకాశం




**కర్నూలు హాస్పిటల్, మే 31, ప్రభాతవార్త:** ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్ ్సవం సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి డా.వై ప్రవీన్‌కుమార్ అధ్వర్యంలో అవగాహన ర్యాలీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయం నుండి ప్రభుత్వ సర్వజన వైద్యశాల వరకు నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమంలో వారు వారు మాట్లాడుతూ ప్రతి సంవత ్సరం మే 31న జరిగే ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత ్సవం జరుపుకుంటున్నామని అందులో భాగంగా ఈసంవత ్సరం పొగాకు ఉత్పత్తుల పరిశ్రమల నుండి పిల్లలను కాపాడుకుందామని నినాదంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ధుమపానం వల్ల క్యాన్సర్, ఊపిరితిత్తుల వ్యాధులు, గుండెపోటు వచ్చే ప్రమాదం ఉందని ధుమపానం మానడం వల్ల ఉపయోగాలున్నాయని తెలిపారు. ధుమపానం మానడం వల్ల గుండె జబ్బుల ప్రమాదం తగ్గును. క్యాన్సర్‌కు గురికాకుండుట, రక్తపోటు నియంత్రణలో ఉండును, రక్త ప్రసరణ సక్రమంగా జరుగును, రుచివాసన గ్రహణశక్తి మెరుగుపడును, రక్తంలో అధికప్రాణవాయువు ప్రసారం, త్వరగా అలసటకు గురికాకుండా ఉండుట, మనమే కాకుండా మన కుటుంబ సభ్యులు కూడ బాగుపడుతారు. తదుపరి ప్రభుత ్వ సర్వజన వైద్యశాల వద్ద పొగాకు వ్యతిరేక ప్రతిజ్ఞ చేశారు. ఈకార్యక్రమంలో డిఎల్‌ఏటివో డా. భాస ్కర్, పిఓ ఆర్‌బిఎస్‌కే అండ్ ఎన్‌సిడి హేమలత, డిపిఎంఓ డా.ఉమ, డిఈఎంఓ ప్రమీలాదేవి, హెచ్‌ఈఈఓ శ్రీనివాసులు, డిప్యూటి డెమో చంద్రశేఖర్, ఫ్లోరోసిన్ కన్సల్టెంట్ సుధాకర్, ఎపిడమాలజిస్టు వేణుగోపాల్, ఎన్‌టిసిపి స్టాఫ్ సైకాలజిస్టు చంద్రశేఖర్, సోషల్ వర్కర్ సోమశేఖర్ స్వామి, డిసిఎం ప్రసాద్, హెచ్‌ఈ పద్మావతీ, మానిటరింగ్ కన్సల్టెంట్ సుమలత, ఆర్‌కె ఎస్‌కె కన్సల్టెంట్ మల్లిఖార్జున అశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మహాభారతం విశ్వజనీనమైన క్యావం

**- తితిదే సభ్యులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి**



**మిడుతూరు, మే31, ప్రభాతవార్త;** మహాభారతం విశ్వజనీనమైనదని, భూమి మీద నివసించే సర్వజనులకు హితాన్ని కలిగించేదని, ధర్మ స్వభావం తెలిసిన వారికి ధర్మశశస్త్ర గ్రంథంగా, పరమాత్మ జీవాత్మ సంబంధం తెలిసిన వారికి వేదాంతశాస్త్రంగా, నీతివిషయాలపై నేర్పు గలవారికి నీతిశాస్త్రంగా, పూర్వకథలు తెలెఇసిన వారికి ఇతిహాసంగా, పౌరాణికులకు పురాణాలసారంగా గోచరిస్తుందని తితిదే సభ్యులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం ముగింపు సందర్భంగా గోపూజ, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గోమాతతో నగర సంకీర్తన చేశారు. సర్వవేదాల సత్యస్వరూపాన్ని తెలిసిన వ్యాసుని రచన, లోకానికి విజ్ఞాన దీపంగా వెలుగుచున్నదని, అలాంటి మహాభారతాన్ని భారతీయుడైన ప్రతి వ్యక్తి చదవాలని పిలుపునిచ్చారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ ఆధ్వర్యంలో మిడుతూరులోని శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి దేవస్థానంలో గత నాలుగు రోజులుగా జయదేవానందస్వామి చేసిన శ్రీముద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై చేసిన ధార్మిక ప్రవచనాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో అర్చకులు వెంకటరామయ్య, ధర్మ ప్రచారకులు చెంచు రామ్మోహన్‌రావు, కాంతాహరి సర్వోత్తమరెడ్డి, బన్నూరు కృష్ణారెడ్డి, వాడాల వెంకటస్వామి, ఈశ్వరరెడ్డి, శ్రీవారి సేవకులు వెంకటేశ ్వర్లు, కె.నారాయణ, మాజీ ఎంపీటీసీ కె.నారాయణ, డి.చిట్టిబాబు, మంగమ్మ, రాములమ్మ, యల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మత్తుకు బానిసలు కాకండి.. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం..



**కోసిగి, మే 31, ప్రభాతవార్త :** చిన్న పిల్లలను నుండి పెద్దవారి వరకు పొగాకు బానిసలవున్నారని, అందుకే మత్తుకుబానిసలు కాకుండ ఉండేందుకే ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం జరుపుతున్నట్లుప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ అధికారి డాక్టర్ మనోజ్‌కుమార్ అన్నారు.. శుక్రవారంప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంను పురస్కరించుకుని ఆరోగ్య సిబ్బందితో కలసి ర్యాలీ నిర్వహించారు.. ఈ సందర్భంగా డాక్టర్ మనోజ్ కుమార్ మాట్లాడుతూ పొగాకు అలవాటు పడితే చిన్న వయసులోనే క్యాన్సర్‌కు గురిఅవుతారన్నారు.. దీన్ని అరికట్టాల్సిన బాధ్యత మన అందరిపై ఉందనన్నారు..ప్రతి ఆరు నెలలకొకసారి ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని మత్తుకు బానిసలు కాకుండాజీవితాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు..అనంతరం నా పర్యావరణాన్ని పొగాకు ఉత్పత్తుల వినియోగం నుండి రక్షించుటకు ప్రయత్నిస్తానని ప్రతిజ్ఞ చేసారు.. ఈ కార్యక్రమంలో ఆసుపత్రిసిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు..